అడిగే వారు లేరని..!

- జూలూరుపాడులో యథేచ్ఛగా వెంచర్లు
- అనుమతి లేకుండానే ఏర్పాటు, ప్లాట్ల విక్రయం
- ఏజెన్సీ చట్టాలకు తూట్లు పొడుస్తున్నా పట్టించుకోని అధికారులు



దండుమిట్ట తండాలో చేసిన ప్లాట్లు



మాచినేనిపేట తండా - కొమ్ముగూడెం మెయిన్‌రోడ్ పక్కన వెంచర్

జూలూరుపాడు: జూలూరుపాడు ఏజెన్సీ మండలం అయినప్పటికీ చట్టాల అమలులో అధికారుల నిర్లిప్తత కారణంగా అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. మండల కేంద్రం పరిసర ప్రాంతాల్లోని వ్యవసాయ భూములను కొందరు కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ లేకున్నా అడ్డదారిలో ప్లాట్లుగా మార్చి అమాయకులకు అంటగడుతున్నారు. తద్వారా కొనుగోలు చేసిన వారు చిక్కుల్లో పడుతుండగా ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. జిల్లా సరిహద్దు గ్రామమైన వినోభానగర్ నుంచి కొమ్ముగూడెం వరకు సుమారు 15 కిలోమీటర్ల మేర ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న వ్యవసాయ భూములను కొందరు వ్యక్తులు ఎకరం భూమిని రూ.50 లక్షలు నుంచి రూ.1.50 కోట్ల వరకు వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు. దీంతో వ్యవసాయ భూములకు డిమాండ్ పెరుగుతోంది. ఆ తర్వాత భూముల్లో వెంచర్లు చేసి అమ్ముకుంటూ రూ.కోట్లు గడిస్తున్నారు. జూలూరుపాడు, వెంగన్నపాలెం, దండుమిట్టతండా, పడమటనర్సాపురం, మాచినేనిపేతండా, కొమ్ముగూడెం తదితర గ్రామాల్లో తల్లాడ – కొత్తగూడెం ప్రధాన రహదారి పక్కన ఇటీవల అక్రమ వెంచర్లు వెలిశాయి. వ్యవసాయ భూములను అడ్డదారిలో లేఔట్ చేసి ప్లాట్లు అమ్ముతున్నా సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడం ఆరోపణలకు తావిస్తోంది. దీనికి తోడు కొందరు వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చి బహుళ అంతస్తులు, గోదాములు, ఫంక్షన్ హాళ్లు, షాపింగ్ మాళ్లు నిర్మిస్తుండడం గమనార్హం.

చట్టాలు ఉన్నా ఫలితమేది?

ఏజెన్సీ ప్రాంతానికి ప్రత్యేక చట్టాలు వర్తిస్తాయి. ఇక్కడ 1 /70, పెసా వంటి చట్టాలు అమల్లో ఉన్నా అధికారుల పట్టింపు లేని తనం అక్రమార్కులకు కలిసి వస్తోంది. ఏజెన్సీ ప్రాంత గిరిజనులు వివక్ష, దోపిడీకి గురికాకుండా వారి భూములు, ఆస్తులు రక్షించడానికి రాజ్యాంగం, సుప్రీంకోర్టు కల్పించిన ఏజెన్సీ చట్టాలు, హక్కులు క్షేత్రస్థాయిలో అమలుకు నోచుకోవడం లేదు. దీంతో ఇళ్లు లేని నిరుపేద, మధ్యతరగతి ప్రజలు సెంటు భూమి కొనలేని విధంగా భూముల ధరలు పెరిగిపోతున్నాయి. దీనికి తోడు ఈ ప్రాంతంలో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయి. ఇంటి నిర్మాణం కోసం గ్రామపంచాయతీ ఎవరైనా దరఖాస్తు చేస్తే అభ్యంతరాల స్వీకరణకు గ్రామపంచాయతీ కార్యాలయంలో నోటీసులు అంటిస్తారు. కాగా, ఏజెన్సీ ప్రాంతంలో ఇంటి నిర్మాణం చేసుకోవడానికి గిరిజనేతరులకు అనుమతి ఇచ్చే అధికారం గ్రామపంచాయతీకి లేకపోగా.. ఎవరైనా నిర్మాణాలు చేపడితే తొలగించే హక్కు ఉంది. అయితే రిజిస్ట్రేషన్ భూముల్లో మాత్రం నిర్మాణాలకు గ్రామపంచాయతీ అనుమతి ఇవ్వవచ్చు. గిరిజనులకు ఇళ్లు గ్రౌండ్ ఫ్లోర్‌తోపాటు మరో అంతస్తు, గిరిజనేతరులు రిజిస్ట్రేషన్ భూమిలో గ్రౌండ్ ఫ్లోర్ మాత్రమే నిర్మించుకునే అవకాశం ఉండగా.. పలువురు నిబంధనలు అతిక్రమిస్తున్నా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

ప్లాట్ల విక్రయానికి అనుమతి లేదు..



వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చుకోవచ్చు తప్ప ప్లాట్ల విక్రయానికి అనుమతి ఉండదు. ఏజెన్సీ చట్టాలకు లోబడి నిర్మాణ అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. కొమ్ముగూడెంలో కొంత భూమినే వ్యవసాయేతర భూమిగా కన్వర్షన్ చేశాం.

–శారద, తహసీల్దార్

అక్రమ నిర్మాణాలైతే కూల్చివేత



ఏజెన్సీ ప్రాంతంలో బహుళ అంతస్తుల భవనాలకు అనుమతి ఉండదు. గిరిజనులు గ్రౌండ్ ఫ్లోర్‌తోపాటు మరో అంతస్తు, గిరిజనేతరులు పట్టా భూమి అయితే గ్రౌండ్ ఫ్లోర్ నిర్మించుకోవచ్చు. అంతకుమించి నిర్మిస్తే కూల్చే అధికారం జీపీలకు ఉంది.

–పి.కృష్ణ, ఎంపీఓ

క్లుప్తంగా

ఎంపీడీఓ కార్యాలయంలో నేడు జాబ్‌మేళా

ఇల్లెందురూరల్: ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ సహకారంతో ఇల్లెందు మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో గురువారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ బాలరాజు తెలిపారు. బుధవారం ఆయన ఫౌండేషన్ ప్రతినిధులతో కలిసి వివరాలు వెల్లడించారు. ఎలక్ట్రికల్, నర్సింగ్, బ్యూటీ, హోటల్ మేనేజ్‌మెంట్, ఆటోమోటివ్ రంగాల్లో యువతకు శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఈ జాబ్‌మేళా ఏర్పాటుచేసినట్లు తెలిపారు. 18 నుంచి 35 ఏళ్ల వయస్సు కలిగి, పదో తరగతి నుంచి డిగ్రీ వరకు ఏదైనా ఒకేషనల్ కోర్సులో పాస్ అయిన వారే కాక ఫెయిల్ అయిన వారు కూడా అర్హులని, ఆసక్తి ఉన్న వారు బయోడేటా, ఆధార్‌కార్డు, పదో తరగతి, ఇంటర్ లేదా డిగ్రీ మెమో జిరాక్స్‌లతో ఉదయం పది గంటలకు హాజరుకావాలని సూచించారు. వివరాలకు 99890 25236, 90634 86822 నంబర్లలో సంప్రదించాలని ఎంపీడీఓ తెలిపారు.

అక్రమంగా పార్టీ ఫిరాయించింది మీరే..

టేకులపల్లి: ఇల్లెందు ఎమ్మెల్యే బానోతు హరిప్రియ నియోజకవర్గ అభివృద్ధి కోసమే రాజ్యాంగబద్ధంగా బీఆర్‌ఎస్‌లో చేరారని బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొమ్మెర్ల వరప్రసాద్, బోడ బాలు తెలిపారు. టేకులపల్లిలో బుధవారం వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే హరిప్రియ ఇచ్చిన మాట ప్రకారం అభివృద్ధి చేస్తుంటే... కాంగ్రెస్ నుంచి టీఆర్‌ఎస్‌లో చేరిన కోరం కనకయ్య మాత్రం అభివృద్ధిని విస్మరించారని విమర్శించారు. జెడ్పీ చైర్మన్ పదవి, కేబినెట్ హోదా కల్పిస్తే స్వప్రయోజనాల కోసం పొంగులేటి గూటికి చేరడం సరికాదన్నారు. సమావేశంలో నాయకులు చీమల సత్యనారాయణ, బానోతు కిషన్, బానోతు రామ, తేజావత్ రవి, పాపా, వాలు, జాటోతు నరేష్, బానోతు రవి, రంగా, భూక్యా తావుర్యా పాల్గొన్నారు.

గ్రంథాలయానికి రిటైర్డ్ ఉద్యోగుల వితరణ



కుర్చీలు, పుస్తకాలతో చైర్మన్, సీనియర్ సిటిజన్లు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలోని జిల్లా గ్రంథాలయానికి విద్యానగర్‌కు చెందిన సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సభ్యులు (విశ్రాంత ఉద్యోగులు) బుధవారం పుస్తకాలు, కుర్చీలు అందజేశారు. రూ.పది వేల విలువైన కుర్చీలు, పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలను గ్రంథాలయ చైర్మన్ దిండిగల రాజేందర్‌కు అందజేయగా ఆయన అభినందించారు. సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొల్లు నాగేశ్వరరావుతో పాటు సురేశ్‌కుమార్, కేశవరావు, ధర్మారావు, విజయ్‌మోహన్, కామేశ్వరరావు, రాజేంద్రప్రసాద్, మైనేని నాగేశ్వరరావు, శివరామకృష్ణ, గురుమూర్తి, కొండా రాములు, గ్రంథాలయ కార్యదర్శి కె.కరుణకుమారి, ఉద్యోగులు ఎం.నవీన్‌కుమార్, వరలక్ష్మి, మణి మృదుల పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పాల్వంచరూరల్: గిరిజన గురుకుల జూనియర్ కళాశాలల్లో సీట్ల భర్తీ కోసం పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకుంటే సీట్లు కేటాయిస్తామని కిన్నెరసాని గిరిజన గురుకుల ప్రతిభ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇక నుంచి పాతపద్ధతిలో కౌన్సెలింగ్ ఉండదని, ఇంటర్ సీట్ కోసం విద్యార్థులు 15వ తేదీలోగా ఆన్‌లైన్‌ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ప్రగతిభవన్ ముట్టడిని విజయవంతం చేయండి

కొత్తగూడెంటౌన్: గిరిజన హక్కులను కాపాడటంతో పాటు ఏజెన్సీ చట్టాలకు తూట్లు పొడుస్తున్న హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాసరావుపై చర్యలు తీసుకోని పక్షంలో జూన్ 30న చేపట్టే ప్రగతి భవన్ ముట్టడిని విజయవంతం చేయాలని ఎస్టీ సంఘాల ఐక్య వేదిక నాయకులు గుగులోతు రాజేశ్‌నాయక్, వాసం రామకృష్ణదొర కోరారు. ఈ మేరకు కొత్తగూడెంలో బుధవారం వారు కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనేతర మహిళకు ఏఎన్‌ఎంగా ఉద్యోగం ఇచ్చిన డీహెచ్‌పై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పాయం సత్యనారాయణ, కొమరం బుచ్చయ్యదొర, రాందాస్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రేగళ్లలో ర్యాలీ

కొత్తగూడెంరూరల్: ప్రపంచ పొగాకు నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. పొగాకు సంబంధిత పదార్థాలను తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి వచ్చే ఇబ్బందుల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా ఎన్సీడీ ప్రోగాం ఆఫీసర్ మణికంఠారెడ్డి, వైద్యురాలు స్వప్న, ప్రోగాం కోఆర్డినేటర్ భద్రు, సబ్ యూనిట్ ఆఫీసర్ హరికృష్ణ పాల్గొన్నారు.

ఓసీని పరిశీలించిన సేఫ్టీ ఆడిట్ కమిటీ

టేకులపల్లి: సింగరేణి ఇల్లెందు ఏరియాలోని కోయగూడెం ఓసీని సేఫ్టీ ఆడిట్ కమిటీ సభ్యులు బుధవారం పరిశీలించారు. భద్రతా అవగాహన పక్షోత్సవాల సందర్భంగా ఓసీలో చేపడుతున్న కార్యక్రమాలను ఆయన పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు. వాహనాల పార్కింగ్, నిర్వహణ, ఫిట్‌నెస్, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కమిటీ సభ్యులు శివప్రసాద్, గని మేనేజర్ సౌరభ్ సుమన్‌తోపాటు అధికారులు శివప్రసాద్, రాజు, అశోక్, శ్రీనివాస్, నాగేశ్వరరావు, రాము, రాకేశ్‌శర్మ పాల్గొన్నారు.

బీఎస్పీకేవీ జిల్లా అధ్యక్షుడిగా సాయికిరణ్



కొత్తగూడెంఅర్బన్: బహుజన్ సమాజ్ పార్టీ కార్మిక విభాగం (బీఎస్పీకేవీ) జిల్లా అధ్యక్షుడిగా సాయికిరణ్ నియమితులయ్యారు. ఈమేరకు బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రా కామేశ్ బుధవారం ప్రకటించి మాట్లాడారు. కార్మిక, కర్షకుల సమస్యల పరిష్కారానికి పాటుపడాలని సూచించారు.

న్యూడెమోక్రసీకి పలువురి రాజీనామా

సింగరేణి(కొత్తగూడెం): కొన్నాళ్లుగా సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీలో కొనసాగుతున్న పి.సతీశ్, చంద్రశేఖర్ ఆ పార్టీకి బుధవారం రాజీనామా చేశారు. ఈమేరకు వారు మాట్లాడుతూ తాము గురువారం ప్రజాపంథాలో చేరనున్నామని తెలిపారు. కార్మికుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని గతనెల 25న న్యూడెమోక్రసీలో చేరినా ఫలితం లేకపోవడంతో తిరిగి ప్రజాపంథాలో చేరాలని నిర్ణయించుకున్నట్లు పేర్కొన్నారు.

మంత్రి పువ్వాడపై విమర్శలు గర్హనీయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వనమా

సూపర్‌బజార్(కొత్తగూడెం): రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌ను కొందరు విమర్శించడం గర్హనీయమని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య తదితరులు మంత్రిని విమర్శించడం సరికాదని తెలిపారు. ఇక ప్రాణాలకు తెగించి తెలంగాణ సాధించిన సీఎం కేసీఆర్‌ను విమర్శిస్తే సహించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, వైస్ చైర్మన్ దామోదర్, ఎంపీపీ బాదావత్ శాంతితో పాటు జేవీఎస్ చౌదరి, ఎంఏ రజాక్, కె.ధర్మరాజు, వేణుగోపాల్, నర్సింహారావు, సత్యభామ పాల్గొన్నారు.

మనోహర్‌రావు కుటుంబ సభ్యులకు పరామర్శ

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల గ్రామంలో సోమరాజు మనోహర్‌రావు పార్థివ దేహాన్ని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు సందర్శించి నివాళులరిపంచారు. ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో కాసుల వెంకట్, ఎంఏ రజాక్, ఆరిఫ్‌ఖాన్, యాకోబ్, జానీ, రాంబాబు పాల్గొన్నారు.

యోగాతో మానసిక, శారీరక ఉల్లాసం

కొత్తగూడెంటౌన్: మానసిక, శారీరక ఉల్లాసం కోసం యోగా దోహదపడుతుందని జిల్లా యువజన క్రీడలశాఖ అధికారి టి.సీతారాం అన్నారు. చుంచుపల్లిలోని సమ్మర్ క్యాంప్‌లో యోగా శిక్షణ పొందిన అభ్యర్థులు ట్రెయినర్ కమలారాణి ఆధ్వర్యాన బుధవారం డీవైఎస్‌ఓను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ్మర్ క్యాంప్‌నకు తల్లిదండ్రులు తమ పిల్లలను ఆసక్తిగా పంపించారని తెలిపారు. అనంతరం శిక్షణ పొందిన పిల్లలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల శాఖ కార్యాలయ మేనేజర్ ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ పొందిన చిన్నారులు, ట్రెయినర్‌తో డీవైఎస్‌ఓ సీతారాం

ముగిసిన ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ఎడవల్లి కృష్ణ

సుజాతనగర్: మండలంలోని రాఘవాపురం గ్రామంలో నాలుగు రోజులుగా అత్యంత ఘనంగా కొనసాగిన గ్రామదేవత, నాభిశిల, ముత్యాలమ్మ దేవతల ప్రతిష్ఠాపన పూజా కార్యక్రమాలు బుధవారంతో ముగిశాయి. మొత్తం ఐదు రోజుల పాటు పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. మొదటి నాలుగు పూజలు చేయగా చివరిరోజు అంకమ్మతల్లి, మహాలక్ష్మమ్మ, ఆంజనేయస్వామి ఆలయాల వద్ద ధ్వజస్తంభాలను ప్రతిష్ఠించడంతో పాటు నాభిశిల ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహించారు. అర్చకులు చొప్పకట్ల జనార్దనశర్మ ఆధ్వర్యంలో పూజలు కొనసాగాయి. ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, టీపీసీసీ సభ్యులు ఎడవల్లి కృష్ణ, నాగా సీతారాములు, కాంగ్రెస్ నేత పోట్ల నాగేశ్వరరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కోనేరు చిన్ని, ఆకుల నాగేశ్వరరావు తదితరులు వేర్వేరుగా పూజలు చేశారు.

ఎమ్మెల్సీ తాతా మధు జన్మదిన వేడుకలు

జూలూరుపాడు: బీఆర్‌ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ జన్మదిన వేడుకలను బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పొన్నెకంటి సతీశ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ లావుడ్యా సోనీతో పాటు యల్లంకి సత్యనారాయణ, లకావత్ గిరిబాబు, ఎదళ్లపల్లి వీరభద్రం, రోకటి సురేశ్, రాంశెట్టి రాంబాబు, చౌడం నరసింహారావు, వేల్పుల నరసింహారావు, కిరణ్, రామ్మూర్తి, రామకృష్ణ, సుభాని, ధర్మా, నీల, ప్రకాష్, వెంకటేశ్వర్లు, నాగరాజు పాల్గొన్నారు.

ఎంపీ బాపూరావుపై చర్యలు తీసుకోవాలి

పాల్వంచ: రాజ్యాంగ విరుద్ధంగా, మత ఘర్షణలు రెచ్చగొట్టేలా ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు చేసిన వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని పాల్వంచ మండల క్రిస్టియన్ జేఏసీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.జాన్‌విల్సన్, ఎస్.ప్రేమ్‌దాస్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక మెర్సీ ప్రార్థన మందిరంలో నిర్వహించిన జేఏసీ కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. బాధ్యతాయుతమైన ప్రజాప్రతినిధి అయి ఉండి హింసాయుత వాతావరణం ప్రేరేపించేలా మాట్లాడిన ఎంపీపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో కె.రవి, శామ్యూల్ దయానిధి, జి.నరేందర్‌రెడ్డి, పి.సూరిబాబు, ఎస్ భూషణం, కె.అనిల్‌కుమార్, కె.భాస్కర్‌రావు, ఎం.యోబు, పెద్ద నాగేశ్వరరావు, బి.రవి, ఎ.పాల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాన్‌విల్సన్

తీరనున్న దుబ్బతండా వాసుల దాహార్తి

జూలూరుపాడు: మండలంలోని కాకర్ల గ్రామ పంచాయతీ దుబ్బతండా ప్రజలు తాగునీటి సమస్యతో నానా తిప్పలు పడుతున్నారని కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా జిల్లా కోఆర్డినేటర్ బానోత్ నవీన్‌రాథోడ్ ట్విట్టర్‌లో ఐటీ మంత్రి కేటీఆర్, జిల్లా కలెక్టర్ అనుదీప్‌కు మంగళవారం పోస్టు చేశాడు. దీనికి స్పందించి వారం రోజుల్లో దుబ్బతండా ప్రజల తాగునీటి అవసరాలకు 120 కిలోలీటర్ల సంప్ నిర్మాణం ప్రారంభమవుతుందని, జూలై 15 నాటికి పూర్తి అవుతుందని కల్లూరు గ్రిడ్ మిషన్ భగీరథ డీఈఈ హరి వరికుట్టి సమాధానం ఇచ్చినట్లు బుధవారం నవీన్‌రాథోడ్ తెలిపారు.

ముందస్తు అడ్మిషన్లపై చర్యలు తీసుకోవాలి

ఇల్లెందురూరల్: విద్యాసంస్థల్లో పాఠశాలల ప్రారంభానికి ముందే నిర్వహిస్తున్న అడ్మిషన్లపై సమగ్ర విచారణ నిర్వహించి అందుకు బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు భూక్య శ్యాం, ఇర్ప రాజేశ్ డిమాండ్ చేశారు. ఎంఈఓ కార్యాలయంలో బుధవారం వారు వినతి పత్రం అందించి మాట్లాడారు. ఏటా ప్రైవేట్ విద్యాసంస్థలు ఇబ్బడిముబ్బడిగా విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలోనైనా ఫీజు నియంత్రణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో రమేశ్, ప్రవీణ్, వినోద్ పాల్గొన్నారు.

ఎంపీ బ్రిజ్‌భూషణ్‌ను అరెస్ట్ చేయాలి



మాట్లాడుతున్న సారంగపాణి

సింగరేణి(కొత్తగూడెం): ఢిల్లీలో రెజ్లర్లపై పోలీసులు వ్యవహరించిన తీరు సరిగ్గా లేదని.. ఇకనైనా వేధింపులకు పాల్పడిన ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను అరెస్ట్ చేయాలని ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొక్కు సారంగపాణి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. న్యాయం కోసం రెజ్లర్లు శాంతియుతంగా ఆందోళన చేస్తుంటే లాఠీచార్జికి పాల్పడడం గర్హనీయమన్నారు. ఈ మేరకు ఎంపీని అరెస్ట్ చేయాలనే డిమాండ్‌తో గురువారం నుంచి మూడు రోజుల పాటు నిరసన తెలపనున్నట్లు పేర్కొన్నారు. తోడేటి నాగేశ్వరరావు, గొని నాగేశ్వరరావు, నెమళ్ల సంజీవ్, మోత్కూరి మల్లికార్జున్‌రావు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ

చుంచుపల్లి: కొత్తగూడెం సొసైటీ కార్యాలయంలో బుధవారం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలను సొసైటీ చైర్మన్ మండె వీరహనుమంతరావు రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీలుగ, పిల్లిపెసర విత్తనాలు కావాల్సిన రైతులు పాస్‌బుక్, ఆధార్‌కార్డుల జిరాక్స్, ఫోన్ నంబర్‌తో సొసైటీ కార్యాలయంలో సంప్రదించి విత్తనాలు పొందాలని చెప్పారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు బండి అమృతరావు, కర్నాటిపు రాంచందర్‌రావు, తీట్ల విజయకుమారి, పోటు వెంకటేశ్వరరావు, మానిటరింగ్ అధికారి సందీప్‌కుమార్, పండ్ల సారయ్య పాల్గొన్నారు.

ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి



ఇల్లెందు: మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరిప్రియ



చుంచుపల్లి: మాట్లాడుతున్న ఎంపీపీ శాంతి

ఇల్లెందు: తెలంగాణ ఆవిర్భవించి తొమ్మిదేళ్లు పూర్తి చేసుకుని పదో ఏట అడుగిడుతున్న సందర్భంగా దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే హరిప్రియ తెలిపారు. జూన్ 2న అన్ని కార్యాలయాలపై జెండాలు ఎగురవేసి అమరవీరులకు నివాళులర్పిస్తామని, 22వ తేదీ వరకు ఈ ఉత్సవాలు సాగుతాయని తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా పల్లె ప్రకృతి, పట్టణ ప్రకృతివనంలో ప్రగతి సాధించిన అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలను సత్కరిస్తామని చెప్పారు. దిండిగాల రాజేందర్, దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, జానీ పాషా, శ్రీనివాసరెడ్డి, రంగనాథ్, పీవీ కృష్ణారావు, గిన్నారపు రాజేశ్ తదితరులు పాల్గొన్నారు. కాగా, సింగరేణిలో నిర్వహిస్తున్న ఉత్సవాలకు హాజరుకావాలని ఎమ్మెల్యే హరిప్రియకు ఏరియా జీఎం షాలేమురాజు ఆహ్వాన పత్రం అందించారు.

అంగరంగ వైభవంగా నిర్వహించాలి

చుంచుపల్లి: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల సన్నాహక సమావేశం బుధవారం జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించారు. దశాబ్ది ఉత్సవాల సందర్భంగా 21 రోజుల పాటు జరిగే రోజు వారి కార్యక్రమాల బాధ్యతలను శాఖల వారీగా అప్పగించారు. అనంతరం ఎంపీపీ బాదావత్ శాంతి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించాలని చెప్పారు. ఈ వేడుకల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములై విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ మేరుగు విద్యాలతతోపాటు కంచర్ల చంద్రశేఖర్‌రావు, కృష్ణప్రసాద్, మంద మంగమ్మ, వీరహనుమంతరావు, గుంటి సత్యనారాయణ, నాగేందర్ పాల్గొన్నారు.

ఉత్సవాలకు హాజరుకండి..

ఇల్లెందురూరల్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జూన్ 5వ తేదీన ట్రాన్స్‌కో ఆధ్వర్యంలో నిర్వహించే వేడుకులకు హాజరుకావాలని కోరుతూ ట్రాన్స్‌కో ఏడీఈ కోటేశ్వరరావు బుధవారం ఎంపీపీ చీమల నాగరత్నమ్మకు ఆహ్వానపత్రిక అందజేశారు. ఏఈలు రాము, రవి, సిబ్బంది పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తిని ఆస్పత్రికి చేర్చిన 'దిశ' సభ్యులు

జూలూరుపాడు: మండలంలోని అనంతారం గ్రామంలో బుధవారం రోడ్డు ప్రమాదం జరగగా గాయపడిన వ్యక్తిని దిశ కమిటీ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. వివరాలిలా ఉన్నాయి.. అనంతారానికి చెందిన కుంజా నాగరాజు తన బైక్‌పై ఇంటి నుంచి బయటకు వెళ్తున్నాడు. గ్రామ శివారులో బైక్ అదుపుతప్పడంతో కిందపడ్డాడు. అటుగా వెళ్తున్న దిశ కమిటీ సభ్యులు గమనించి 108కి ఫోన్ చేసి చికిత్స నిమిత్తం నాగరాజును ఆస్పత్రికి తరలించారు. దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కొడెం సీతాకుమారి, కుదురుపాక నిర్మల, బి.లక్ష్మి తదితరులు ఉన్నారు.

ఆరోపణలపై విచారణకు సిద్ధమేనా?

ఇల్లెందు: మాజీ ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య ధారపాడులో భూకబ్జాలకు పాల్పడినట్లు ఎమ్మెల్యే చేసిన ఆరోపణలపై విచారణకు సిద్ధంగా ఉండాలని కనకయ్య వర్గీయులు, ఉద్యమకారులు భూక్యా నాగేశ్వరరావు, సూర్నపాక సత్యనారాయణ, బోళ్ల సూర్యం, పత్తి రంజిత్ సూచించారు. ఇల్లెందులో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఇటీవల మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ చేసిన వ్యాఖ్యలు వాస్తవమని ఉద్యమనాయకుడు దిండిగాల రాజేందర్ చెప్పడం గర్హనీయమన్నారు. ఉద్యమకారుడైన భూక్యా నాగేశ్వరరావు, ఎంపీటీసీ మండల రామును వేధిస్తే దిండిగాల ప్రశ్నించలేదన్నారు. పలువురికి పదవుల ఆశ చూపి వదిలేశారని మండిపడ్డారు. కాగా, దిండిగాలకు గ్రంథాలయ కమిటీ చైర్మన్ పదవి కనకయ్య చలవతోనే వచ్చిందనే విషయాన్ని మర్చిపోవద్దని హితువు పలికారు. సమావేశంలో మండల రాము, పూనెం సురేందర్, పత్తి స్వప్న, పూనెం కవిత, తాటి భిక్షం, రంజిత్ నాగార్జున, పాయం స్వాతి పాల్గొన్నారు.



అటెన్షన్ ప్లీజ్

పొంచి ఉన్న ప్రమాదం

మండలంలోని రాఘవాపురంలో ప్రధాన సెంటర్ పక్కన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టకపోగా.. ఆ పక్కనే ఉన్న పాత విద్యుత్ స్తంభం కూలేందుకు సిద్ధంగా ఉంది. మరో వారం రోజుల్లో ఈ సెంటర్‌లోనే అంకమ్మ తల్లి జాతర జరగనున్నందున అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ ఏర్పాట్లు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

–సుజాతనగర్



ప్రశ్నించాల్సిన అధికారి : కిషన్, ఎలక్ట్రికల్ ఏఈ

సెల్ నంబర్ : 94910 88527